క్లుప్తంగా

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ఒంగోలుమెట్రో: ఆషాఢ మాసం పూర్తయి శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం గాంధీ రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా అమ్మవారిక ప్రత్యేక పూజలు చేశారు. ప్రకృతి అంటే పరమేశ్వరి, సమృద్ధిగా పండుతున్న పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి అర్చకులు పూజలు చేశారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రతి మంగళ,శుక్రవారం ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తదియారాధన సంఘం ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు తాతా రామకృష్ణ, పువ్వాడ విజయ్ కృష్ణ, రాము, గ్రంధి శ్రీనివాసులు, పబ్బిశెట్టి అశోక్, బాదం మురళి, శ్రీరామ్, ఆర్టీసీ సురేష్, అనిల్, సిహెచ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మీద అక్రమంగా పెట్రోల్ అమ్మకం



ఒంగోలు వన్‌టౌన్: అక్రమంగా రోడ్డు మీద బాటిళ్లలో పెట్రోల్ అమ్ముతున్నారు. ఒంగోలు ఇందిరమ్మ కాలనీ, ఎఫ్‌సిఐ గిడ్డంగుల ఎదురుగా రోడ్డు మీద బాటిళ్లలో పెట్రోల్ నింపి విక్రయిస్తున్నారు. లీటర్ బాటిల్, రెండు లీటర్ బాటిళ్లలో పెట్రోల్ నింపి రోడ్డు మీద ఉంచి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. 50 లీటర్ల చొప్పున ఇంట్లో నిల్వ చేసుకుని అక్కడి నుండి బాటిళ్లలో తెచ్చి విక్రయిస్తున్నారు. ఈ పెట్రోల్‌ను ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారో తెలియదు. ఎలాంటి అనుమతులు లేకుండా అమ్ముతుండటం గమనార్హం. మెయిన్ రోడ్డు మీదే పెట్రోల్ బాటిళ్ల ఉంచి అమ్ముతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున వ్యాపారం సాగుతోంది. ఇళ్ల మధ్యలో పెట్రోల్ నిల్వ చేస్తుండటంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే పెద్ద ఎత్తున నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలభైరవ స్వామికి అమావాస్య పూజలు



ఒంగోలుమెట్రో: ఆషాఢ అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరం వద్ద ఉదయం ఆషాఢ అమావాస్య సందర్భంగా కాలభైరవ చిత్రపటానికి నిర్వాహకులు భక్తులు అష్టోత్తరం , ధూప దీప హారతులతో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాలభైరవ సేవా సమితి సభ్యులు దేసు వెంకట సుబ్బారావు, పబ్బిశెట్టి భాను కిరణ్, పచ్చిపులుసు శ్రీకాంత్, దేసు కాశి విశ్వేశ్వరరావు, మనోహర్ గడ్డం రాజేష్, పచ్చిపులుసు లోకేష్, భాస్కరుని మురళీమోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ ఇవ్వకుండా ఇబ్బందులు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు డీఏలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఏ.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన డీఏలు కూడా ఇవ్వడం లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఉద్యోగులకు కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రతి కేబినెట్‌లో డీఏ, ఐఆర్ ఇస్తారని ఉద్యోగులు ఎదురుచూడటం తర్వాత నిరాశ చెందటం అలవాటుగా మారిందన్నారు. ఈ రోజు జరిగిన క్యాబినెట్‌లో ఉద్యోగులకు ప్రభుత్వం మొండి చేయిచూపిందని, ఉద్యోగుల పట్ల మరీ ఇంత నిర్లక్ష్యంగా ఉండటం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టి, పెండింగ్‌లో ఉన్న డీఏలలో కనీసం రెండు డీఏలు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులకు ఐఆర్ వెంటనే చెల్లించి, పెండింగ్ బకాయిలు దశల వారీగా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముక్కు మూసుకోవాలంతే..!



జనరేటర్ వద్ద పబ్లిక్ కోసం నిర్మించిన మరుగుదొడ్లు



నీటి సౌకర్యం లేని యూరినల్ బేసిన్లు



నీటి సరఫరా లేని హ్యాండ్‌వాష్ బేసిన్

- కలెక్టరేట్‌లో అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- నీటి సౌకర్యం లేకపోవడంతో పరిస్థితి దారుణం
- 350 మందికి పైగా సిబ్బంది, వందలాది మందితో నిత్యం బిజీబిజీ
- పట్టించుకోని అధికారులు

ఒంగోలు సబర్బన్: ఏ ప్రభుత్వ పథకాలైనా ప్రారంభించాలంటే జిల్లా కలెక్టర్‌రేట్ నుంచే ప్రారంభం అవుతుంది. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా ఉండాల్సిన కలెక్టరేట్‌లో సమస్యలు తిష్టవేసి ఉంటే మరి మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఏంటో ఇట్టే అర్థమవుతోంది. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో మారుమూల ప్రాంతం నుంచి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పనులో కోసం వందల మంది కలెక్టర్‌రేట్‌కు వస్తుంటారు.. పోతుంటారు. కాని ఇక్కడే అధికారుల పక్షపాతం కనిపిస్తోంది. వివిధ పనుల కోసం వచ్చే వారికి మలమూత్ర విసర్జన చేయాలంటే సిగ్గుపడాల్సి వస్తోంది. పైఅధికారుల చాంబర్‌లు మాత్రం సువాసన వెదజల్లేలా మరుగుదొడ్లు ఉంటాయి. కాని సామాన్య ప్రజలకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి.

అధికారులకు ఒకలా.. సామాన్య ప్రజలకు మరోలా

కలెక్టర్‌కు రెండు ఛాంబర్లు, రెండు, మూడు కాన్ఫరెన్స్ హాళ్లు, వీడియో కాన్ఫరెన్స్ హాలుతో పాటు అనేక సౌకర్యాలు ఈ భవనంలో ఉంటాయి. అదేవిధంగా జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, ఇక స్పెషల్ కలెక్టర్లు, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్లు ఇలా ఆ స్థాయి అధికారులకు కూడా సౌకర్యాలలో లోపం ఉండదు. రెవెన్యూతో పాటు మరో 28 ప్రభుత్వ విభాగాలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. ఆ విభాగాల హెడ్‌లకు కూడా ప్రత్యేకంగా చాంబర్లు ఉన్నాయి.

మరుగుదొడ్లను చూస్తే వాంతికి రావాల్సిందే..!

కలెక్టరేట్‌లో పనిచేసే సిబ్బందికి, పనుల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ప్రాంగణంలో అంతస్తుల వారీగా మరుగుదొడ్లు నిర్మించారు. అయితే వాటి నిర్వహణ పరిశీలిస్తే ముక్కుపుటాలదిరే దర్గంధం వెదజల్లుతోంది. అంతేకాదు వాంతికి కూడా చేసుకోవాల్సి వస్తోంది. అంత అధ్వానంగా ఉన్నాయి మరుగుదొడ్ల పరిస్థితి. అలాంటి వందలాది మంది ప్రతిరోజూ వచ్చిపోయే కార్యాలయ ప్రాంగణంలో మరుగుదొడ్లలో నీళ్లు రాకపోతే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అందరికీ తెలిసిందే.

ప్రాంగణంలో 27 మరుగుదొడ్ల పాయింట్లు..

కలెక్టరేట్‌లో మొత్తం 27 మరుగుదొడ్ల పాయింట్లు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ మొదలుకొని మూడు అంతస్తుల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు, అధికారులకు ఉండే అటాచ్‌డ్ బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు కాకుండా. ఈ 27 మరుగుదొడ్లను కార్యాలయ సిబ్బంది, పబ్లిక్ వాటిని వాడుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఇవికాక ప్రత్యేకంగా మీ కోసం హాలుకు ఉత్తరంగా స్వచ్ఛభారత్ కార్యాక్రమంలో భాగంగా మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా నిర్మించారు. అయితే ఆ మరుగుదొడ్లు ఒక్క సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించే రోజుమాత్రమే తాళాలు తీసి ఉంచుతారు. మిగతా అన్ని రోజులూ తాళాలు వేసే ఉంటారు. ఆ మరుగుదొడ్ల వల్ల ప్రాంగణంలోని సిబ్బందికి గానీ బయట నుంచి వచ్చే ప్రజలకుగానీ మీ కోసం కార్యక్రమం రోజు మినహా మిగతా రోజుల్లో నిరుపయోగంగానే ఉంటాయి. ప్రాంగణానికి ఉత్తరం వైపు జనరేటర్ వద్ద పబ్లిక్ కోసం మరుగుదొడ్లు నిర్మించారు. వాటి పరిస్థితి మరీ అధ్వానం. మరుగుదొడ్ల గోడలు కనపడతాయి తప్ప లోపలకు వెళ్లలేని పరిస్థితి. కేవలం బేసిన్లు మాత్రమే ఉంటాయి. నీటి సౌకర్యం శూన్యం.

భవనం పైన మూడు వాటర్ ట్యాంకులు ఉన్నా..నిరుపయోగమే

ప్రకాశం భవనం పైన బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు వాడకానికి గాను నీటి సరఫరా చేసేందుకు మూడు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. నిత్యం వాటర్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఇక్కడ ఇబ్బందల్లా మరుగుదొడ్లలో నీటి సరఫరాకు అవసరమైన పైపులు, ట్యాపులు, పరికరాలు లేకపోవటమే మరుగుదొడ్ల దుర్గంధానికి ప్రధాన కారణంగా ఉంది. కమోడ్లకు, యూరినల్ పాయింట్లకు నీటి సరఫరా చేసే సిస్టం మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. దాంతో మరుగుదొడ్లు దుర్గంధంగా, దుర్వాసనతో కునారిల్లుతున్నాయి.

మహిళా ఉద్యోగినుల పరిస్థితి దారుణం..

కలెక్టరేట్‌లో దాదాపు 350 మందికి పైగా అధికారులు, సిబ్బంది పనిచేస్తుంటారు. వాళ్లలో సగానికి సగం మహిళా ఉద్యోగులు ఉన్నారు. వీళ్ల పరిస్థితి చాలా బాధాకరం. ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. అందులోనూ కలెక్టరేట్ మహిళా ఉద్యోగినుల వేధింపులు కూడా అక్కడక్కడా వినిపిస్తూనే ఉన్నాయి. ఒక పక్క ఆ విధంగా ఉంటే సిబ్బంది అధికారులకు మరుగుదొడ్ల పరిస్థితిని ఏమి చెప్పుకోగలరు. ఇంతపెద్ద పరిపాలనా కేంద్రంలో మరుగుదొడ్ల నిర్వహణ మాత్రం నామమాత్రంగా ఉంది. మరుగుదొడ్ల శుభ్రం కోసం కేవలం ఐదుగురు సిబ్బందిని మాత్రమే కేటాయించారు. వాళ్లు ఉదయం వచ్చి వాటిని శుభ్రం చేస్తారు. తరువాత వాళ్లు మరుగుదొడ్ల వద్ద ఉండి పర్యవేక్షించాల్సిన విధులు లేవు. ఇప్పటికైనా అధికారులు వాటిపై దృష్టి పెట్టి మరుగుదొడ్ల నిర్వహణ, సరైన నీటి సౌకర్యం, పారిశుద్ధ్య సిబ్బందిని ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్థిరాస్తి రిజిస్ట్రేషన్ అవగానే పేరు మార్పు

ఒంగోలు సబర్బన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కాగానే ఆటోమేటిక్‌గా నగర పాలక సంస్థలు, మున్సిపాలటీల్లో పేరు మార్పు జరుగుతుందని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో పట్టణ ప్రాంతాలలో ఆటో మ్యూటేషన్ (అర్బన్ ఆటో మ్యూటేషన్) అమలు జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంత భూములు, భవనాల రిజిస్ట్రేషన్ అనంతరం ఆస్తి వివరాలు ఆటోమెటిక్‌గా సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో పేరు మార్పు అయ్యే విధంగా ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకువస్తున్నారన్నారు. మున్సిపల్ శాఖ, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ఈ విధానం అములులోనికి వస్తుందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల కింది ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. రిజిస్ట్రేషన్ తరువాత ఆస్తిని మున్సిపల్ రికార్డులో వేరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆస్తి వివరాలు పన్నుల నమోదు (ప్రాపర్టీ ట్యాక్స్ రికార్డ్స్)లో వాటంతటగా చేరతాయన్నారు. పౌరులకు సమయం, అవినీతి రహిత సేవలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆస్తిపన్ను అసెస్మెంట్ వివరాలను సబ్ రిజిస్ట్రార్‌కు సరైన విధంగా అందించడంతో ఆటో మ్యూటేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చునని కమిషనర్ వివరించారు.

గ్రంథాలయ ఉద్యమనేతకు నివాళులు

సంతనూతలపాడు (చీమకుర్తిరూరల్): గ్రంథాలయాలకు అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ ఆయుర్వేది వైద్యాధికారి ఎ కరుణాకరరావు పేర్కొన్నారు. గురువారం తొలి గ్రంథాలయ ఉద్యమనేత పితామహుడు పద్మశ్రీ స్వర్గీయ అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతి వేడుకలు స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానసముపార్జనకు, స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడ్డయన్నారు. అనంతరం వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె సత్యనారాయణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ఘోరంగా విఫలం

- ఆగస్టు 3వ తేదీ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- కొత్తపట్నంలో నిర్వహణ
- వివరాలు వెల్లడించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



. సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో దారణంగా విఫలమైందని.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం కొత్తపట్నంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక భారీగా నష్టపోతున్నారని తెలిపారు. బాబు చేసిన మోసాలను ప్రజలందరకు తెలియచెప్పేందుకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని ఆగస్టు 3వ తేదీన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 20న జరగాల్సిన కార్యక్రమం వాతావరణం అనుకూలించక వాయిదా వేశామన్నారు. 15 గ్రామ పంచాయతీల్లో అల్లూరు, ఈతముక్కల, మడనూరు, కొత్తపట్నం ఒక్కో పంచాయతీలో 200 మంది చొప్పున 800 మంది తగ్గకుండా రావాలని కోరారు. అదేవిధంగా రాజుపాలెం, కె.పల్లెపాలెం, మోటుమాల ఒక్కో పంచాయతీలో 150 మంది అంటే 450 మంది రావాలని చెప్పారు. ఆలూరు, గాదెపాలెం గుండమాల, పాదర్తి, రంగాయపాలెం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, సంకువారిగుంట ఒక్కో పంచాయతీలో 100 చొప్పున సభకు రావాలని కోరారు. ఆగస్టులో జరిగే సభను 2 వేల మందితో విజయవంతం చేయాలని, ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరావు, సర్పంచ్ కారాని జయరావు, దొనె రామ్మోన్, గాలి ముసలారెడ్డి, మల్లిఖార్జున్‌రావు, తుళ్లూరి వెంకట సుబ్బారావు, తాత నాంచార్లు, తాత శ్రీను, సుబ్రహ్మణ్యం, కోటిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తంబి వెంకటేష్, గౌరవరపు శివాజీ, తంబి వెంకటేశ్వర్లు, పురిణి పోలయ్య, తంబి నరసింహరావు, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోళ్లు పటిష్టంగా చేపట్టాలి

- పొగాకు కొనుగోలు కమిటీతో సమావేశమైన జేసీ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద నల్లబర్లీ పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఒంగోలు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఆయన జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సభ్యలతో సమావేశమయ్యారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై సమీక్షించి పలు అంశాలను ఆమోదించారు. నల్లబర్లీ పొగాకు పండించే చిన్న, సన్న కారు రైతులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 10వ తేదీ వరకు రీ షెడ్యూల్ చేశారని, అందుకనుగుణంగా పొగాకు రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలుకు అనుమతివ్వగా, ఇప్పటివరకు జిల్లాలో రూ.5.64 కోట్ల విలువ గల 677 మెట్రిక్ టన్నుల పొగాకును 245 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారన్నారు. కొనుగోలు ప్రక్రియ తక్కువ క్వింటాళ్ల నుంచి ఎక్కువ క్వింటాళ్ల కలిగిన రైతు నుంచి ఆరోహణ క్రమంలో 20 క్వింటాళ్లకు మించకుండా కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో మార్క్ ఫెడ్ డీఎం హరి క్రిష్ణ, జిల్లా సహకార శాఖాధికారి ఇందిరా దేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాస రావు, మార్కెటింగ్, లీగల్ మెట్రాలాజి శాఖఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

రవిబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబును సత్కరిస్తున్న శివప్రసాద్, నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో జనరల్ కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన చావలి శివప్రసాద్ నియమితులైన అనంతరం ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చుండూరి రవిబాబును గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం చుండూరి రవిబాబు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. చావలి శివప్రసాద్ మాట్లాడుతూ నాకు ఈ పదవి ఇచ్చినందుకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, నాయకులు కుట్టిబోయిన కోటి యాదవ్, ఫణిదపు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్వో ఓబులేసు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు సబర్బన్: కేంద్ర ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బీ ఓబులేసు పేర్కొన్నారు. తన చాంబర్‌లో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఒక ఓటు కాకుండా రెండో ఓటు కలిగి ఉండటం నేరమన్నారు. ఎలక్షన్ నిబంధనల ప్రకారం సెక్షన్ 31, ఆర్‌పీఏ–1950 యాక్ట్ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నెల వారి గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీ సభ్యులతో సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకోవాలన్నారు. మీరు నివాసం ఉన్న చోట మాత్రమే ఓటును కలిగి ఉండాలని కోరారు. రెండో ఓటును రద్దు చేసుకోకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణిస్తారని ఆయన హెచ్చరించారు. కనుక వెంటనే రెండో ఓటును తొలిగించుకోవాలని ఆయన ఓటరుకు విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓట్లు నమోదు చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లు తొలిగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మి ప్రసన్న, ఆర్డీవో కనిగిరి కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, కుమార్, వరకుమార్, సత్యనారాయణ, ఓ రవీంద్రారెడ్డి, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, బాబురావు, తహశీల్దార్లు చిరంజీవి, శివశంకర్, భాస్కర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు

సంతనూతలపాడు(చీమకుర్తిరూరల్): విద్యార్థులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొనగానివారిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్, నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుణ వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న పాత వాహనానికి ఈ-వేలం

ఒంగోలుసిటీ: ప్రకాశం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి సంబంధించి కాలపరిమితి తీరిన పాత వాహనానికి ఈ నెల 29వ తేదిన ఈ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి గలవారు ఏపీ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పేదలకు సాయంగా నిలుద్దాం



మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణరావు, ఎంపీడీఓ

మద్దిపాడు: పేదలకు సాయంగా నిలవడానికి ప్రభుత్వం పీ-4 విధానాన్ని ప్రవేశ పెట్టిందని.. పేదరికంలో ఉన్న వారికి మన వంతుగా సహాయపడదామని మండల స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఏ పీడీ నారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు గ్రామ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారుగా 18 వందల బంగారు కుటుంబాలను గుర్తించారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపు వారికి సాయం చేసే వారిని గుర్తించి వారి ద్వారా ఆకుటుంబానికి చేయూత అందించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ వీ జ్యోతి, డిప్యూటీ తహశీల్దార్ అజయ్, మండల అధికారులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు(చీమకుర్తిరూరల్): పీ-4 సర్వేలో భాగంగా మండలంలో 1350 బంగారు పేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఎంపిక చేసినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఆయా గ్రామాల్లో మార్గదర్శులను ఎంపిక చేసేందుకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, మండల స్థాయి అధికారులు దీనిపై గ్రామాల్లో మార్గదర్శకులను ఎంపిక చేయాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంఈవో వెంకా రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్ఞాన మార్గంలోకి నడిపించే సాధనం చదువు



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

కొత్తపట్నం: జ్ఞాన మార్గంలోకి నడిపించే సాధనం చదువు ఒక్కటేనని వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో నోటి పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు తులసీ కుమారి, పద్మావతి పాల్గొని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ.. దాతలు అందించిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. దాతలు ఉచిత పుస్తకాలు, ఉచిత బస్సు పాసులు కల్పించడం అలాగే విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యరక్ష కార్డులను ఇచ్చి ఉచితంగా వైద్యం అందజేస్తున్నారని వారు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.